## ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కేపీహెచ్‌బీ కాలనీ వాసవీ దేవాలయంలో చండీహోమం పూజలో భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 11 : కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, చండీహోమం, శ్రీలలితా పారాయణం, సాయంత్రం పల్లకీ సేవా, పంచహారతులు, ఉంజల్‌సేవ, తీర్థప్రసాదన వితరణ పూజలు నిర్వహించారు. భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెరుకు కుమారస్వామి, కమిటీ సభ్యులు, భక్తులున్నారు.

## జేఎన్‌టీయూహెచ్ అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రావుకు నివాళులు



డి.శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 11 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్, ఈసీఈ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్‌రావు బ్రెయిన్ హెమరేజితో మృతి చెందాడు. గత వారం రోజులుగా బ్రెయిన్ హెమరేజితో వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన మృతి చెందాడు. కాగా ఆదివారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావు, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నర్సింహారెడ్డి, ఆయా విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వర్సిటీ సీనియర్ ప్రొఫెసర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేనివని స్మరించుకున్నారు.

# మైసమ్మా.. దీవించమ్మ

- వైభవంగా సూరారం కట్టమైసమ్మ జాతర
- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. బోనాలు సమర్పణ



ప్రత్యేక అలంకరణలో..

దుండిగల్, ఫిబ్రవరి 11: కొలిచేటి భక్తుల కొంగుబంగారం, సూరారం గ్రామప్రజల ఇలవేల్పు సూరారం కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ తల్లి జాతర వైభవోపేతంగా జరిగింది. ఆదివారం ప్రధాన జాతర కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వేలాదిసంఖ్యలో పోటెత్తారు. మొక్కులు చెల్లించుకొని పిల్లా పాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. డప్పు చప్పుల్లు, శివసత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలతో ఆలయ ప్రాంగణంలో సరికొత్త సందడి నెలకొన్నది. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచే వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానకమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించింది.

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖులు...

కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ జాతరను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల కృపాకటాక్షంతో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చల్లంగా ఉండాలని కోరారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ డా.భద్రారెడ్డి, డైరెక్టర్ డా.ప్రీతిరెడ్డి, బీజేపీ నేత ఎస్.మల్లారెడ్డి, కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరిరావు, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ డా.భద్రారెడ్డి





పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి



### మల్లన్న సేవలో ఎమ్మెల్యే

నిజాంపేట్‌లోని మల్లికార్జున స్వామి(మల్లన్నగుడి) ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన జాతరలో ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో పలువురు కార్పొరేటర్లు, ఆలయకమిటీ ప్రతినిధులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– దుండిగల్, ఫిబ్రవరి 11



### గవర్నర్‌కు రూ.లక్ష చెక్కు అందజేత

జై జవాన్.. జై కిసాన్‌కు మద్దతుగా ఆదివారం గవర్నర్ తమిళి సై సౌందర రాజన్‌ను కలిసి రూ.100,116 చెక్కును విద్యార్థులతో కలిసి అందజేస్తున్న త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ జి.వీరేంద్ర చౌదరి. ఈ కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్, డాక్టర్ జి.వీరేంద్ర చౌదరి, పాఠశాల ప్రతినిధులు ఉన్నారు.

– మాదాపూర్, ఫిబ్రవరి 11





### హాస్పిటల్‌ను ప్రారంభించిన మంత్రి

హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రసాద్ హాస్పటల్‌ను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కూర్మయ్య గారి కొండల్‌రావు, హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ కొమరయ్య, డాక్టర్ సుమ తదితరులు పాల్గొన్నారు.

– మియాపూర్ , ఫిబ్రవరి 11



### సమస్యల పరిష్కారానికి కృషి

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకులు, పలు సంఘాల నేతలు, ప్రజలు శంభీపూర్ కృష్ణను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

–దుండిగల్, ఫిబ్రవరి 11

## సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్

అల్లాపూర్, ఫిబ్రవరి 11: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీవివేకానందనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు త్వరలోనే నిర్వహిస్తామని ఆ కాలనీ మాజీ అధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం శ్రీవివేకానందనగర్ కమ్యూనిటీహాల్‌లో కాలనీకి చెందిన మాజీ అధ్యక్షుడు, సీనియర్ సభ్యులతో పులిగొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాలాగా వివేకానందనగర్ కాలనీ సంక్షేమ సంఘానికి ఎన్నికలు జరుగకపోవడంతో.. ఒకే వ్యక్తి అధ్యక్షుడిగా కొనసాగటంతో కాలనీవాసులు ఎన్నికలు నిర్వహించాలని తమ దృష్టికి తీసుకురావడంతో ఈ సమావేశం ఏర్పాటు చేశానని తెలపారు. పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్, తుంగం శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, అప్పారావుతో నలుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటుచేసి త్వరలోనే ఎన్నికలకు సంబంధించిన అడ్డంకులను తొలగించి ఎన్నికల నిర్వహణకు కృషి చేస్తామని సమావేశంలో తీర్మానించారు.

## దర్శి నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమావేశం



కేపీహెచ్‌బీ కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దర్శి నియోజకవర్గం నేతలు శివప్రసాద్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, ప్రజలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 11 : కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని హౌసింగ్ బోర్డు కమ్యూనిటీ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దర్శి నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్‌స్టాప్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వంగవీటి మోహనరంగ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బూచెపల్లి శివప్రసాద్‌రెడ్డి, సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్సార్ స్ఫూర్తితో తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏపీలో సుపరిపాలన అందిస్తున్నారని ప్రజలందరూ ఆయన పాలనను హర్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన యువ నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11: ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేసే క్రమంలో సమాజంలో తమదైన శైలిలో సేవలను అందించడం అభినందనీయమని యువనేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ యువజన యువనాయకుడు కేపీ విశాల్‌గౌడ్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ గ్రామంలో శివాత్మిక క్లినిక్ లాబరేటర్ అండ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన అనంతరం ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సమాజ సేవలో భాగస్వాములై ముందుకు రావడం అభినందనీయమని, ఇలాంటి వారికి తమ ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివాత్మిక క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డా.వెంకటరమణ, డా.సోమ చంద్రశేఖర్, డా.మాధురి సోమ, డా.హిమబిందు, డా.సోమరాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### హఫీజ్‌పేట్‌లోని మదీనాగూడలో..

మాదాపూర్, ఫిబ్రవరి 11: హఫీజ్‌పేట్‌లోని మదీనాగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సిటిజన్ హాస్పిటల్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న మార్పులకు ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నట్లు జనరల్ ఫిజీషియన్, డాక్టర్ షకీనా గ్రేసి అన్నారు.





ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న పలువురు కాలనీ వాసులు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్, ఫిబ్రవరి 11 : 11 కేవీ ఫీడర్స్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని సెంట్రల్ బ్రేక్‌డౌన్ ఏడీఈ (సీబీడీ ఏడీఈ) పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోని కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీసాయినగర్, ఇందిరానగర్, టైమ్‌టెక్ కంపెనీ, ఎస్‌వీకే లాజిస్టిక్స్ పరిసర ప్రాంతాలు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గణేశ్ కాంత ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, గణేశ్ కాంత, ఎన్‌కే టూల్స్, కోర్ట్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సాక్షి యూజీసీ ఫీడర్ పరిధిలోని ఎస్‌వీసీఐ, సాక్షి, స్టీల్ సప్లయర్స్, ఏపీ టెక్ టవర్స్, హోమ్‌స్టీల్స్, అగర్వాల్ స్టీల్, మెఘా ఇంజినీరింగ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కులుగుతుంది. వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

## విద్యాశాఖకు తక్షణమే మంత్రిని కేటాయించాలి



నిఖిల్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

మాదాపూర్, ఫిబ్రవరి 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిఖిల్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడంతో ఆదివారం ఏబీవీపీ సభ్యులు మాదాపూర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి, మోసపూరితమైన వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచారని, ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేయాల్సిన విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వాపోయారు. రానున్న రోజుల్లో అన్ని పరీక్షలు నిర్వహించడంతో పాటు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాల్సి ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖకు తక్షణమే మంత్రిని నియమించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ప్రజావసరాలకు సీడీపీ నిధుల వినియోగం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, చిత్రంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, ఫిబ్రవరి 11 : నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం విడుదలయ్యే నిధులన్నింటినీ ప్రజావసరాలకే వినియోగిస్తానన్నారు. మియాపూర్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలో రూ.30లక్షల సీడీపీ నిధులతో నిర్మించిన కాలనీ కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీ అవసరాలకు తగ్గట్టుగా కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం సమావేశాలు కాలనీవాసుల వేడుకలకు ఇది ఎంతో వెసులుబాటుగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని కాలనీలన్నింటిలోనూ ఈ తరహా కమ్యూనిటీ హాళ్లను ఇప్పటికే సీడీపీ నిధులతో పూర్తి చేసి ప్రజలకు అందించామన్నారు. ఇంకా కావాల్సిన ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నిత్యం కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందిస్తానని, ప్రజల సౌకర్యమే తన అంతిమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బాలు, శ్రీధర్, రామిరెడ్డి, నరేశ్, సాంబయ్య, నరేంద్ర, శ్రీనివాస్, రత్నకిశోర్, నాయుడు, రాణి, జయలక్ష్మి, రాజేశ్వరి, కల్యాణి, మాధవి, భారతి, సత్యనారాయణ, హరి, మణయ్య, లక్ష్మీనారాయణ, అమలేశ్ పాల్గొన్నారు.

## మానవ సేవే మాధవ సేవ

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మూసాపేట ముస్కిపేటలో జెనరిక్ మెడికల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 11 : మానవ సేవే మాధవ సేవయని.. భారత వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రసంశనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం మూసాపేట ముస్కిపేటలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బి.వి.పి. జెనరిక్ మెడికల్ స్టోర్‌ను ఎమ్మెల్యే కృష్ణారావు, అధ్యక్షుడు అశ్వినిసుబ్బారావు, వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్.హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా అందిస్తున్న సేవలు గొప్పవన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. అనంతరం 12 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీహెచ్.అనీల్, బి.అనీల్‌కుమార్, చైతన్య, మహేశ్వరీ, సుదర్శన్, నరేంద్రకృష్ణ, సాధన, నర్సింహాచారి, తిరుపతిరెడ్డి, సదాశివరెడ్డి ఉన్నారు.

## ప్రజలకు వినోదాన్ని అందించడం అభినందనీయం



కుత్బుల్లాపూర్ హెచ్‌ఎంటీ మైదానంలో బాంబే సర్కస్‌ను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్, పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్, నిర్వాహకులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11: ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబంతో కలిసి కాస్తంత మనోవికాసాన్ని అందించి వారిలో నూతనోత్తేజాన్ని కల్పించేందుకు ఇలాంటి సర్కస్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేఎం గౌరీశ్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసీ మైదానంలో ఏర్పాటు చేసిన బాంబేసర్కస్‌ను సందర్శించి ప్రారంభించారు. ప్రజలు ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో సరదాగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేనేజర్లు ఉన్ని కృష్ణ, వెంకట్‌రెడ్డి, ఇలియాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఒడిశా ఫుడ్, కల్చరల్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా సంబల్పూరి నృత్యాలు, ఒడిసి, కథక్, ఒరియా పాటలను కళాకారులు ప్రదర్శించిన తీరు అద్భుతంగా సాగింది.

– కొండాపూర్, ఫిబ్రవరి 11





రవేనా అపార్ట్‌మెంట్‌లో పట్టుబడ్డ పేకాట నిందితులు

## పేకాటరాయుళ్ల అరెస్ట్

దుండిగల్, ఫిబ్రవరి 11: వేర్వేరు చోట్ల పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతినగర్ రోసరీ హైస్కూల్ సమీపంలోని రవేనా అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందడంతో.. శనివారం రాత్రి దాడి చేసి వెంకటేశ్వరరాజు, రామకృష్ణంరాజు, బాపిరాజువర్మ, మోహన్‌రాజు పట్టుకొని అరెస్ట్ చేశారు. రూ.28,500, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



చైతన్య బిల్డింగ్‌లో పట్టుబడ్డ పేకాట నిందితులు

**మరో చోట..** ప్రగతినగర్ చైతన్య బిల్డింగ్‌లో కొందరు పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో శనివారం తెల్లవారుజామున పోలీసులు దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనలో గంగాధర్, మురళి, ఆగంరాజు, అజయ్‌కుమార్, నవీన్, అప్పారావు పట్టుబడ్డారు. వీరినుంచి రూ.10,400 మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేశారు.

## తల్లిదండ్రుల చెంతకు..

బండ్లగూడ, ఫిబ్రవరి 11 : తప్పిపోయిన ముగ్గురు చిన్నారులను వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంబాగ్ విద్యానికేతన్ స్కూల్ సమీపంలో ఉండే అనిల్, సోను దంపతుల ముగ్గురు పిల్లలు తమ ఇంటి సమీపంలో ఆడుకుంటూ తప్పిపోయారు. కొద్దిసేపటికి గమనించిన పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తమ తల్లిదండ్రుల పేరు అనిల్, సోను అని మాత్రమే పిల్లలు తెలిపారు. దీంతో పోలీసులు వివిధ పోలీస్‌స్టేషన్లతోపాటు స్థానికులకు ఈ విషయమై సమాచారం ఇచ్చారు. సాయంత్రం విషయం తెలుసుకున్న సోను, అనిల్ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ పిల్లలే అని తెలిపారు. దీంతో ఇన్‌స్పెక్టర్ యాదగిరి విచారణ జరిపి ముగ్గురు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పిల్లల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.